

మూసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్‌కాలనీ పార్క్‌లో హోలీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఏసీపీ వెంకన్న



జీహెచ్‌ఎంసీ కార్మికులతో కలిసి హోలీ సంబరాలలో కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి



నాదర్‌గుల్ మాతృ దేవోభవ అనాథాశ్రమంలో అభాగ్యులతో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొన్న నిర్వాహకుడు గిరి కుటుంబ సభ్యులు



క్రిస్టల్ అవెన్యూలో హోలీ సంబరాలు నిర్వహిస్తున్న కాలనీవాసులు



మునగనూరులో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు రంగులు పూస్తున్న లంబాడీ ఐక్యవేదిక ఉద్యోగుల సంఘం, బంజారాకాలనీ సంక్షేమ సంఘం నాయకులు



హోలీ వేళ కొత్తపేట కాలనీవాసులతో కార్పొరేటర్ పవన్‌కుమార్

# రంగుల కేళి..
# సంబరాల హోలీ

ఎల్‌బీనగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రంగుల కేళి హోలీని ప్రజలు వాడవాడల ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. గురువారం రాత్రి కామ దహం నిర్వహించిన ప్రజలు శుక్రవారం ఉదయం నుంచే రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకుంటు రంగులు పూసుకున్నారు. వాసవీకాలనీలో జరిగిన హోలీ సంబరాలలో స్థానికులతో కలిసి యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు మునిగితేలారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నివాసంలో జరిగిన వేడుకల్లో సుధీర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సంబరాలలో పాల్గొన్నారు. సరూర్‌నగర్, లింగోజిగూడ, ఆర్‌కేపురం ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

### మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లలో..

**సరూర్‌నగర్ :** హోలీ వేడుకలను శుక్రవారం మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉత్సాహంగా ఉల్లాసంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబరాల్లో మునిగి తేలారు. స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, కాలనీల ప్రతినిధులు గురువారం రాత్రి కామ దహనం చేశారు. శుక్రవారం రంగుల పండుగను ఘనంగా జరపుకున్నారు.

**కొత్తపేట :** కొత్తపేట డివిజన్ పరిధిలోని కాలనీల కూడళ్లు, దారులంతా శుక్రవారం హోలీ వేళ చిన్నా పెద్దా అందరూ రంగుల్లో మునిగి తేలారు. అంతటా పిల్లలు, యువకులు కేరింతలతో బైకులు, సైకిళ్లపై తిరుగుతూ సందడి చేస్తూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. కార్పొరేటర్ పవన్‌కుమార్ కాలనీవాసులతో కలిసి హోలీ ఆడారు.

### చంపాపేట, హస్తినాపురంలలో..

**చంపాపేట :** చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లలోని ప్రజలు హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా డివిజన్‌లలోని అపార్టుమెంట్‌లలో హోలీ సంబరాలను అట్టహాసంగా జరుపుకున్నారు. హోలీ సందర్భంగా రహదారులు జనంలేక వెలవెలబోయాయి.

### హయత్‌నగర్, తుర్కయంజాల్‌లలో..

**హయత్‌నగర్ :** హయత్‌నగర్ డివిజన్, తుర్కయంజాల్ మున్సిపాలిటీలో హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్న పెద్ద తేడా లేకుండ అందరు ఒకరిపైన ఒకరు రంగులు చల్లుకుని సంబరాలలో మునిగిపోయారు. కాలనీ సంక్షేమ సంఘాలు, అపార్టుమెంట్‌లలో మహిళలు రంగుల్లో మునిగితేలారు. కొంత మంది యువకులు ద్విచక్ర వాహనాలపైన కేరింతలు కొడుతూ స్నేహితుల వద్దకు వెళ్లి రంగులు పూసుకున్నారు. అదేవిధంగా నగరం నుండి అనేక మంది యువకులు బైకులపైన నగర శివారు ప్రాంతాలకు తరలివచ్చి హోలీ సంబరాలు చేసుకున్నారు. హయత్‌నగర్ శివారు గ్రామాలకు తరలివచ్చిన యువకులు జోరుగా మందు పార్టీలలో మునిగిపోయారు.



హోలీ వేడుకల్లో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

### మూసారాంబాగ్‌లో..

**చాదర్‌ఘాట్ :** మూసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ పార్క్‌లో జరిగిన హోలీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఏసీపీ వెంకన్న, ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, జిట్టా సురేందర్‌రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, టీడీపీ నేత బొక్క గోవర్ధన్‌రెడ్డి టీపీసీసీ కార్యదర్శి దండెం రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

**అబ్దుల్లాపూర్‌మెట్ :** హోలీ వేడుకలను అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం రాత్రి ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో పిడకలు. కర్రలతో కాముడి దహనం చేశారు. ఉదయం నుంచే చిన్న పెద్ద తేడా తారతమ్యం లేకుండా అందరు రంగులు చల్లుకుని హోలీ సంబరాలను జరుపుకున్నారు. ఇక యువత హోలీ అనంతరం వ్యవసాయ పొలాలు, గెస్ట్ హౌస్‌ల వద్ద దావతుల్లో మునిగిపోయారు.



చంపాపేట డివిజన్‌లోని మాధవనగర్‌కాలనీలో హోలీ సంబరాలలో చిన్నారులు

### క్రిస్టల్ అవెన్యూలో..

**వనస్థలిపురం :** వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్లలో కాలనీవాసులు కులమతాలకు అతీతంగా రంగులు చల్లుకుంటు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని క్రిస్టల్ అవెన్యూలో హోలీ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, కాలనీవాసులు ఆటపాటలతో అలరించి, బెలూన్స్‌ను గాల్లోకి ఎగురవేసి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి.వి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.అశోక్, టి.రామ్మోహన్ పాల్గొన్నారు.

**సైదాబాద్ :** హోలీ సంబరాలను సైదాబాద్, మాదన్నపేట, ఐఎస్‌సదన్ పరిసర ప్రాంత ప్రజలు ఆనందోత్సవాలతో సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ఆడిపాడుతూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. సింగరేణికాలనీలో సేవాలాల్ బంజారా సంఘం ఆధ్వర్యంలో గిరిజన మహిళల హోలీ సంబరాలు అంబరాన్నంటాయి.

### మన్సూరాబాద్, నాగోల్‌లలో..

**మన్సూరాబాద్ :** హోలీ వేడుకలు మన్సూరాబాద్, నాగోల్ డివిజన్ల పరిధిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల పరిధిలోని ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, చిన్నలు, పెద్దలు అందరూ ఒకరిపై మరొకరు తీరొక్క రంగులను చల్లుతూ సంతోషాలతో గడిపారు. ఇందులో భాగంగా ఎక్కడెక్కడో ఉన్న స్నేహితులు, అపార్ట్‌మెంట్, కాలనీవాసులు ఒకచోట గూడి సంబరాల్లో పాల్గొన్నారు.



మన్సూరాబాద్‌లో పారిశుధ్య సిబ్బందితో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



దిల్‌సుఖ్‌నగర్‌లో హోలీ వేడుకల్లో చిన్నారులు



ఎల్బీనగర్‌లో హోలీ సంబరాలలో యువతుల కేరింతలు



జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బందికి రంగులు పూసి సంబరాలు చేసుకుంటున్న నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్



బాలాపూర్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్న బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు

## మానసిక వికలాంగుడి అదృశ్యం



సిద్దంశెట్టి నర్సింహరాజు

హయత్‌నగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మానసిక వికలాంగుడు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంట్లూర్ ప్రజయ్ గుల్మొహర్‌లో నివాసం ఉండే సిద్దంశెట్టి నర్సింహరాజు(48) మంగళవారం ఉదయం పది గంటలకు సెల్‌ఫోన్ ఇంట్లోనే పెట్టి కుంట్లూర్‌కు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. నర్సింహరాజు మానసిక వికలాంగుడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో తల్లి జయలక్ష్మి తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఢిల్లీ వెళ్తున్నానని..



రంగ స్వామి

హయత్‌నగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): యువకుడు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జునసాగర్‌కు చెందిన సభావత్ చందు కుమారుడు సభావత్ రంగస్వామి(23) ఆరు నెలల క్రితం కొత్తగా బైకు కొనుకుని ఢిల్లీలో చదువుకోవడానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి హయత్‌నగర్ నేతాజీకాలనీలో నివాసం ఉండే అక్క వర్షా వద్దకు వచ్చాడు. బైకును అక్కడే పార్కు చేసిన రంగస్వామి ఢిల్లీకి వెళ్తున్నానని అక్క వర్షాకు చెప్పి వెళ్లాడు. అప్పుడప్పుడు అక్కకు ఫోన్ చేసి తాను సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్నానని నమ్మించాడు. దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు రంగస్వామి గురించి ఆరా తీయగా హైదరాబాద్‌లోనే ఉంటున్నట్లు తెలిసింది. దీంతో అక్క వర్షా రంగస్వామికి ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ అని వస్తుంది. శుక్రవారం వర్షా తన తమ్ముడు కనిపించడం లేదని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నా రు. ఇదిలా ఉండగా కుటుంబ సభ్యులు డబ్బులు రంగస్వామి అకౌంట్‌లో వేస్తున్నారు. దీంతో రంగస్వామి వాటిని ఖర్చు చేసుకుంటు జల్సా చేస్తున్నట్లు తెలిసింది.

## ఇంట్లో మందలించారని యువతి..



అమీనా ఫాతిమా

వనస్థలిపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఇంట్లో మందలించారని యువతి అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం డివిజన్ శక్తినగర్‌కు చెందిన కుమారి అమీనా ఫాతిమా(28) ఏ పనిచేయకుండా ఖాళీగా ఇంట్లో ఉంటుంది. ఈ క్రమంలో అమీనా ఫాతిమాను తల్లి ఫర్హాద్ ఫాతిమా మందలించడంతో తల్లితో గొడవపడి ఈనెల 4న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఎక్కడ వెతికినా ఫలితం లేకపోగా తన వద్ద ఉన్న ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో తల్లి ఫర్హాద్ ఫాతిమా శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆఫీసుకు వెళ్తున్నానని చెప్పి యువకుడు..



భీమగాని నరేష్

వనస్థలిపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆఫీసుకు వెళ్తున్నానని చెప్పి యువకుడు అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం డివిజన్ నాగార్జున కాలనీకి చెందిన భీమగాని నరేష్(25) ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 12న తన కుటుంబ సభ్యులకు ఆఫీస్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాలేదు. తన వద్ద ఉన్న ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో నరేష్ కుటుంబ సభ్యులు శుక్రవారం వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఎల్‌బీనగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా, మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేసినందుకు నిరసనగా శుక్రవారం బీఆర్‌ఎస్ ఆర్‌కేపురం డివిజన్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కర్యదర్శి అరవింద్‌శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్‌లు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తున్నదన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతుంటే భరించలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం నియంతృత్వ పోకడలను మానుకోవాలని వారు హితవుపలికారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ ఉద్యమకారుల కన్వీనర్ న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, సీనియర్ నాయకులు కొండ్ర శ్రీనివాస్, జగన్మోహన్‌రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, బండారి మల్లేష్ ముదిరాజ్, సంతోష్ రజక, శివనాయక్, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రధాన కర్యదర్శి అరవింద్‌శర్మ, పెండ్యాల నగేష్ తదితరులు

### మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో..

**చాదర్‌ఘాట్ :** అసెంబ్లీ సమావేశాల నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు శుక్రవారం మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్ మలక్‌పేట నియోజకవర్గ నాయకుడు పగిళ్ల నర్సింగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నర్సింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో జగదీశ్‌రెడ్డిని సమావేశాల నుంచి సస్పెండ్ చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సాయ భువనేశ్వరీ, పార్టీ నాయకులు బాబు సుదర్శన్, శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఎల్ మహేష్, ఎం.వెంకటేష్, అమర్నాథ్‌గౌడ్, చుక్క కృష్ణ, యాదగిరి, శ్రీకాంత్, వేణు, జగదీష్, సాయి, నవజీత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను అడ్డుకుంటున్న చాదర్‌ఘాట్ పోలీసులు

### బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన బీఆర్‌ఎస్ మలక్‌పేట నాయకుడు పగిళ్ల నర్సింగ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలను శుక్రవారం సాయంత్రం చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎల్‌బీనగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనుల నేపథ్యంలో టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ ఆపరేషన్ డివిజన్ పరిధిలోని 11కేవీ గ్రీన్‌హిల్స్ ఫీడర్, హుడా సాయినగర్ ఫీడర్, అష్టలక్ష్మీ ఫీడర్ లైన్ల పరిధిలోని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రీన్‌హిల్స్‌ఫీడర్ పరిధిలోని గ్రీన్‌హిల్స్‌కాలనీ, కృష్ణానగర్, మొయ్యనగర్, ద్వారకానగర్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు, 11 కేవీ హుడాసాయినగర్ ఫీడర్ పరిధిలోని జడ్జస్‌కాలనీ, విజయశ్రీకాలనీ, వివేకానందనగర్, సహారా ఎస్టేట్స్ పరిసర ప్రాంతాలు, 11కేవీ అష్టలక్ష్మీ ఫీడర్ పరిధిలోని అష్టలక్ష్మీ టెంపుల్, పరిసరాలు, వాసవీకాలనీ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో కలిగే అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## పోగొట్టుకున్న పర్సు తిరిగి అప్పగింత



పర్సును బాధితుడైన నర్సింహారావుకు అప్పగిస్తున్న ట్రాఫిక్ పోలీస్ ప్రమీల, హోంగార్డు నర్సింహారావు

చాదర్‌ఘాట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్, హోంగార్డు తన నిజాయితీని చాటుకున్నారు. పోగొట్టుకున్న బాధితుడి పర్సును తిరిగి అప్పగించారు. వివరాల్లోకి వెళితే మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ ప్రమీల, హోంగార్డు నర్సింహారావులు మూసారాంబాగ్ చౌరస్తాలో బుధవారం విధులు నిర్వహిస్తుండగా రోడ్డుపై పర్సు దొరికింది. దాన్ని గమనించిన వీరిద్దరు. అందులోని వివరాల ఆధారంగా మొబైల్ ఫోన్‌కు ఫోన్ చేశారు. పోగొట్టుకున్న పర్సు తమ వద్ద ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన బాధితుడు సలీంనగర్ నివాసి డీసీఎం డ్రైవర్ సలీముద్దీన్ శుక్రవారం మూసారాంబాగ్ చౌరస్తా చేరుకున్నారు. అదే సమయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ప్రమీల, హోంగార్డు నర్సింహారావును బాధితుడైన సలీముద్దీన్ సంప్రదించాడు. పోగొట్టుకున్న పర్సులో విలువైన ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, ఏటీఎం కార్డులున్నట్లు బాధితుడు వివరాలను తెలియజేయగా ట్రాఫిక్ సిబ్బంది పర్సును అప్పగించారు. ట్రాఫిక్ పోలీసులు నిజాయితీతో పర్సును అప్పగించడం పట్ల సలీముద్దీన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నీటి ట్యాంకర్ కోసం 155313కి ఫోన్ చేయండి



డీజీఎం హస్మత్‌అలీ

ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు మలక్‌పేట సర్కిల్-1 డిప్యూటీ జనరల్ మేనేజర్ హస్మత్‌అలీ తెలిపారు. తాగునీటి ట్యాంకర్ కావాల్సిన వారు 155313 నంబర్‌కు కాల్ చేస్తే గంట వ్యవధిలో ట్యాంకర్‌ను ఇంటి వద్దకు పంపిస్తామని వివరించారు. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ పరిధిలో 5 ట్యాంకర్లు అందుబాటులో ఉంచామన్నారు. నీటి ట్యాంకర్ కావాల్సిన వారు ఫోన్‌లో సమాచారం తెలిపితే మీరు ఉండే ప్రాంతానికి ట్యాంకర్ వస్తుందని, కమర్షియల్ ట్యాంకర్‌కు రూ.850, డొమెస్టిక్ ట్యాంకర్‌కు రూ.500 చెల్లించాలని చెప్పారు. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి లేదు. పైపులైన్ పగిలిన ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. అన్నిప్రాంతాల్లో సరిపడ నీరు నల్లాల ద్వారా ప్రతిరోజు సరఫరా అవు తుందన్నారు. నీటి వృథాను, అక్రమ కనెక్షన్లను అరికట్టేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామన్నారు. అక్రమ కనెక్షన్లను గుర్తించి తొలగిస్తున్నామన్నారు. రంజాన్ సందర్భంగా మసీదులకు, జాతరలు, పండుగలు జరిగే దేవాలయాల వద్ద ఉచితంగా నీటి ట్యాంకర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## పిచ్చుక గూళ్ల పంపిణీని సద్వినియోగం చేసుకోండి



పిచ్చుక గూళ్లను పంపిణీ చేస్తున్న భావన శ్రీనివాస్

వనస్థలిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉచిత పిచ్చుక గూళ్ల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలని జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భావ న శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ వనస్థలిపురం, జాగృతి అభ్యుదయ సంఘం స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రెడ్ వాటర్ ట్యాంక్ వెనుకాల ఉన్న గణేష్ కాన్ఫరెన్స్ హాల్లో ఈనెల 16న ఉచితంగా పిచ్చుక గూళ్ల సెట్, డాగ్ వాటర్ బౌల్స్ పంపి ణీ కార్యక్రమం చేపడుతున్నట్లు శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల ప్రకృతి ప్రేమికులు మీ పేరు, ఫోన్ నంబర్‌ను వి.గణేష్ ఫోన్.9666750383కి పంపించాలన్నా రు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వనస్థలిపురం అధ్యక్షుడు విట్టా దూరయ్య, నందకిషోర్, అత్తలూరి మల్లికార్జున రావు, పద్మజ, రవీందర్‌రెడ్డి, బొగ్గు సురేష్ పాల్గొన్నారు.



శబరిమలలో గోమాతతో కలిసి గోరక్షకుడు బాలకృష్ణగురుస్వామి తదితరులు

## శబరిమలకు చేరుకున్న గోరక్ష మహాపాదయాత్ర

- గోవుతో కలిసి అయ్యప్ప దర్శనం చేసుకున్న బాలకృష్ణగురుస్వామి

**అబ్దుల్లాపూర్‌మెట్ :** గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోరుతూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గోరక్షకుడు బాలకృష్ణగురుస్వామి చేపట్టిన గోరక్ష మహాపాదయాత్ర శుక్రవారం శబరిమలకు చేరుకుంది. గోమాతతో కలిసి బాలకృష్ణ గురుస్వామి అయ్యప్పస్వామిని దర్శించుకున్నట్లు పాదయాత్రలోని నాగేష్ గౌడ్, ప్రవీణ్‌గౌడ్ తెలిపారు. మొదటి సారిగా గోమాతతో కలిసి అయ్యప్ప స్వామిని దర్శించుకోవడం జరిగిందని తెలిపారు. సెప్టెంబర్ 27న ప్రారంభమైన పాదయాత్ర కన్యాకుమారిలో ముగుస్తుందన్నారు. సతీష్‌గౌడ్, టింకు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
రాజు : 99854 02786